క్లుప్తంగా

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 9 మంది అరెస్ట్

కిర్లంపూడి: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 9 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై జి.సతీష్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో మండలంలోని గత పది రోజులుగా నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 9 మందిని అరెస్ట్ చేసి శనివారం ప్రత్తిపాడు జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరిచామన్నారు. కోర్టు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించగా ఒకరికి 2 రోజులు జైలు శిక్ష విధించినట్టు ఎస్సై తెలిపారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి


రాచపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారికి వినతి పత్రాన్ని అందజేస్తున్న శ్రీను

ప్రత్తిపాడు రూరల్: సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను కోరారు. ఈ మేరకు శనివారం మండలంలోని రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆర్ఆర్ పవన్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సీజనల్ వ్యాధుల బారిన పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిల్లో రోగుల సౌకర్యార్థం తగు ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టి ప్రజలు రోగాలు బారిన పడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పిల్లి రాజు, ఎస్.కోటేశ్వరరావు, కందిమళ్ల సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు మఠంలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు. భక్తుల ఆర్థిక సాయంతో అన్నదానం చేసినట్టు జీయ్యన్న ట్రస్ట్ సభ్యులు తెలిపారు. భక్తులు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని అన్న ప్రసాదాలు స్వీకరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


షార్ట్‌తో ఆటో నడుపుతున్న డ్రైవర్

తుని: ఆటోవాలాలు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పట్టణ సీఐ గీతారామకృష్ణ హెచ్చరించారు. తుని పట్టణంలో శనివారం సాయంత్రం ఓ ఆటో డ్రైవర్ షార్ట్ వేసుకొని ఆటో డ్రైవ్ చేస్తూ కాలేజీ విద్యార్థినుల తీసుకెళ్తుండగా పట్టుకున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆటో డ్రైవ్ చేస్తుండడంతో అపరాధ రుసుం విధించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ రామకృష్ణ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు విధిగా నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జోరుగా పింఛన్ల పంపిణీ

ఏలేశ్వరం: మండలవ్యాప్తంగా లబ్ధిదారులకు శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. ఆగస్టు నెలకు సంబంధించి లబ్ధిదారులకు పింఛన్లు ఇంటింటికీ వెళ్లి అందజేశారు. మండలంలోని పెద్దనాపల్లిలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి వర్షంలోనూ లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. సిరిపురంలో బీజేపీ నాయకులు అధికారులతో కలిసి పింఛన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లాశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని 95 శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు శనివారం తెలిపారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సహకారంతో పింఛన్ల పంపిణీ సకాలంలో పూర్తి చేశామన్నారు.

శృంగార వల్లభస్వామి ఆలయానికి తగ్గిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: స్వయంభూ తిరుపతి శృంగార వల్లభుడి ఆలయానికి తుపాన్ ప్రభావం తగిలింది. ప్రతి శనివారం వేల మంది భక్తులు స్వామి వారి దర్శనానికి వస్తుండేవారు. ఈ వారం ఉదయం నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో భక్తుల తాకిడి తగ్గింది. సుమారు ఐదువేల మంది మాత్రమే వచ్చారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామిని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని వివిధ సేవల టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి రూ.97,453 ఆదాయం సమకూరినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు.

జల తాండవం

- నిండుకుండలా మారిన జలాశయం
- ప్రమాద స్థాయికి చేరిన నీటినిల్వలు
- ప్రస్తుత నీటిమట్టం 377.7 అడుగులు


సాగునీటితో కళకళలాడుతున్న తాండవ జలాశయం

కోటనందూరు: క్యాచ్‌మెంట్ ఏరియాలో వారం రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో తాండవ జలాశయం తొణికిసలాడుతోంది. ప్రాజెక్టులో నీటి నిల్వలు దాదాపుగా ప్రమాద స్థాయికి చేరాయి. ఏ క్షణంలోనైనా జలాశయం నుంచి నీటిని నదిగుండా సముద్రానికి విడిచిపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. జలాశయానికి వచ్చే ఇన్‌ఫ్లో ఆధారంగా నదికి నీటివిడుదలపై నిర్ణయం తీసుకుంటామని తాండవ అధికారులు తెలిపారు. తాండవ నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. కాగా ఆగస్టు నెలలోనే ప్రాజెక్టు నిండుకుండలా మారడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు ఢోకా లేదని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

51,465 ఎకరాలకు నీరు

తాండవ జలాశయం నుంచి కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లోని 51,465 ఎకరాలకు సాగునీరు అందుతోంది. కాకినాడ జిల్లాలో కుడి ప్రధాన కాలువ ద్వారా 11,391 ఎకరాలు, ఎడమ ప్రధాన కాలువ ద్వారా 7,385 ఎకరాలు వెరసి మొత్తం 18,776 ఎకరాలకు, అనకాపల్లి జిల్లాలో ఎడమ ప్రధాన కాలువ నుంచి 25,440 ఎకరాలు, కుడి ప్రధాన కాలువ ద్వారా 7,249 ఎకరాలు వెరసి మొత్తం 32,689 ఎకరాలకు సాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. జలాశయ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా కనిష్ఠ నీటిమట్టం 340 అడుగులు. ప్రస్తుతం జలాశయంలో 377.7 అడుగుల నీటి మట్టం ఉంది.

గతంలో ఎన్నడూలేని విధంగా..

గత రెండు దశాబ్దాలుగా ప్రాజెక్టు పరిస్థితిని గమనిస్తే ఏటా ఆగస్టు రెండు లేదా మూడో వారాల్లో నీటిని విడుదల చేసేవారు. ఆ సమయంలో ప్రాజెక్టులో నీటి నిల్వలు కనిష్ఠ స్థాయిలో మాత్రమే ఉండేవి. రైతుల అవసరాల కోసం తప్పనిసరి పరిస్థితుల్లో వరుణుడిపై భారం వేసి అధికారులు నీటి విడుదలకు శ్రీకారం చుట్టేవారు. ఈ ఏడాది పరిస్థితి గతానికి పూర్తి భిన్నం. ఖరీఫ్ ఆరంభంలో అంతంత మాత్రంగానే ఉన్న నీటినిల్వలు రెట్టింపు వర్షాలతో ఒక్కసారిగా గరిష్ఠ స్థాయికి చేరాయి. ఇకపై కాలం గడ్డుపోయినా ఖరీఫ్ సీజన్‌లో సాగునీటికి ఢోకా ఉండదు. రైతుల అవసరాలకు అనుగుణంగా ఖరీఫ్ కాలమంతా నీటిని విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తాండవ అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



క్యాచ్‌మెంట్ ఏరియా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు జలాశయంలో నీటి నిల్వలు గరిష్ఠ స్థాయికి చేరాయి. ప్రస్తుత నీటిమట్టం 377.7 అడుగులకు చేరింది. వర్షాలు కొనసాగితే ప్రాజెక్టు భద్రత దృష్ట్యా ఏ సమయంలోనైనా స్పిల్‌వే ద్వారా నీటిని సముద్రానికి విడుదల చేసే అవకాశం ఉంది. తాండవనది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రజలెవరూ నది ఒడ్డుకు వెళ్లకూడదు. పశుపక్ష్యాదులను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలి.

– అనురాధ, డీఈఈ, తాండవ ప్రాజెక్టు

క్యాచ్‌మెంట్ ఏరియాలో విస్తారంగా..

అనకాపల్లి జిల్లా అటవీప్రాంతంలోని ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియా సారిక మల్లవరం, జోగుంపేట, యాసర కొత్తూరు, అమ్మపేట, గాధంపాలెం, గంటావారి కొత్తగూడెం పాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో జలాశయానికి భారీగా ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రస్తుతం వర్షాలు భారీగా కురుస్తుండడంతో ఇన్‌ఫ్లో భారీగా వస్తుందని తాండవ అధికారులు తెలిపారు.

నీటి కోసం రైతుల ఎదురుచూపులు

మండలంలో మెట్ట గ్రామాలైన భీమవరపుకోట, ఎస్సార్ పేట, అప్పలరాజుపేట, బిళ్లనందూరు, ఇండుగపల్లి గ్రామాల్లో రైతులు తాండవ నీటి కోసం ఎదురు చూస్తున్నారు. సాధారణంగా వర్షాలు విస్తారంగా పడినప్పటికీ తాండవ నీరు వస్తేనే ఈ గ్రామాల్లో నాట్లు పడతాయి. ఈ గ్రామాల్లో రైతులు నారుమడులు సిద్ధం చేశారు. ఇప్పటికే తాండవ నీటిని విడుదల చేసినప్పటికీ ఇంకా పొలాలకు నీరు చేరలేదు. తాండవ నీరు వస్తేనే ఇక్కడ నాట్లు పూర్తయ్యే అవకాశం ఉంది. కాగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు పల్లపు గ్రామాలైన కోటనందూరు, కాకరాపల్లి, అల్లిపూడి, కేఏ మల్లవరం, ఎల్లీపేట, కొత్తకొట్టాం గ్రామాల్లో దాదాపుగా నాట్ల ప్రక్రియ పూర్తయింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తుని రూరల్: తాండవ నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ఎంపీడీఓ పి.రవికుమార్ శనివారం రాత్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తాండవ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. పూర్తి స్థాయి నీటి మట్టం 380 కాగా ఇప్పటికే 377.92 అడుగులకు నీటి నిల్వలు చేరాయన్నారు. ప్రాజెక్టు రక్షణ దృష్ట్యా 378.50 అగుడులకు నీటి నిల్వలు చేరితే ఎప్పుడైనా నదిలోకి స్పిల్‌వే ద్వారా నీరు విడుదల చేయనున్నట్టు తాండవ డీఈ పి.అనురాధ హెచ్చరించినట్టు ఎంపీడీఓ తెలిపారు. క్యాచ్‌మెంట్ ఏరియాలో భారీ వర్షాలు కురుస్తుండడంతో రిజర్వాయర్‌లోకి వరదనీరు వచ్చి చేరుతోందన్నారు. నదిలోకి ఎవరూ దిగవద్దని, పరివాహక ప్రాంతాలైన మరువాడ, నందివంపు, డి.పోలవరం, ఎస్.సూరవరం, కొలిమేరు, కుమ్మరిలోవ, రేఖవానిపాలెం, తుని పట్టణవాసులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అలాగే పంపా రిజర్వాయర్‌లో గరిష్ఠ నీటి మట్టానికి వరదనీరు చేరిందన్నారు. 98.75 అడుగులకు నీటి నిల్వలు చేరినందున అదనపు జలాలు విడుదల చేసే అవకాశం ఉందన్నారు. మండలంలో టి.తిమ్మాపురం, గవరపేట, తదితర గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తాండవ డ్యామ్ పరిశీలన


తాండవ ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు

కోటనందూరు: అల్పపీడనం ప్రభావంతో శనివారం ఉదయం నుంచి విస్తారంగా వర్షం కురవడంతో తాండవ డ్యాంను డీఈఈ పి.అనురాధ పరిశీలించారు. ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో సమతుల్యంగా ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రాజెక్టు ప్రధాన గేట్లతో పాటు స్పిల్‌వే గేట్లను పరిశీలించారు. జలాశయం గరిష్ఠస్థాయి (377.7అడుగులు)కు చేరడంతో ఇన్‌ఫ్లో ఆధారంగా నీటిని నదికి విడుదల చేసేందుకు స్పిల్‌వే గేట్లను సిద్ధం చేయించారు. ఈ సందర్భంగా డీఈఈ అనురాధ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు ప్రాజెక్టు పరిస్థితిని పరిశీలిస్తున్నామని వివరించారు. నీటిమట్టం 380 అడుగులు దాటితే అదనపు జలాలను నదికి విడిచిపెడతామన్నారు. కార్యక్రమంలో ఇంజినీర్లు శ్యామ్‌కుమార్, రమణపాత్రుడు, రవికుమార్, రామకృష్ణ, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడు శ్రీనివాసరావుకు రీసెర్చ్ ఎక్సలెన్స్ అవార్డు


డాక్టర్ శ్రీనివాసరావు


రీసెర్చ్ ఎక్సలెన్స్ అవార్డు

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ (అటానమస్) కళాశాలలో రసాయన శాస్త్రం అధ్యాపకుడిగా పని చేస్తున్న డాక్టర్ ఎ.శ్రీనివాసరావుకు రీసెర్చ్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. రసాయన శాస్త్రంపై పరిశోధనలకు గాను ఈ అవార్డు లభించినట్టు శ్రీనివాసరావు శనివారం తెలిపారు. సైంటిఫిక్ ఇంటర్నేషనల్ పబ్లిషింగ్ హౌస్ (తమిళనాడు) ఈ అవార్డును అందించినట్టు ఆయన తెలిపారు. మెమెంటో, సర్టిఫికెట్, మెంబర్ షిప్ కార్డును నిర్వాహకులు అందజేశారన్నారు. సైంటిఫిక్ ఇంటర్నేషనల్ పబ్లిషింగ్ హౌస్‌లో జీవిత కాలం మెంబర్ షిప్ లభించిందన్నారు. దీంతో రసాయన శాస్త్రంలో మరిన్ని పరిశోధనలు చేసేందుకు తనకు అవకాశం లభించిందని చెప్పారు. రీసెర్చ్ ఎక్సలెన్స్ అవార్డు గ్రహీతను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత, అధ్యాపకులు అభినందించారు.

వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యనమల దివ్య

తుని: వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశపు హాలులో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువులు, పురుగుమందుల డీలర్ల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటి చేసేందుకు ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందన్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించాలన్నారు. ఎరువులు, పురుగు మందుల డీలర్లు రైతులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. అనంతరం శిక్షణలో ఉత్తీర్ణత సాధించిన డీలర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో యనమల రాజేష్, సుర్ల లోవరాజు, కుసుమంచి శోభారాణి పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ


శంఖవరంలో మొక్కలు నాటిన ఐసీడీఎస్, అంగన్‌వాడీ సిబ్బంది

శంఖవరం: మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో తల్లి పేరు మీద ఒక చెట్టు మన రేపటి కోసం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తల్లి పేరు మీద మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అరుణాశ్రీ, పి.జానకిలక్ష్మి, రజిని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

కిర్లంపూడి: ప్రతిఒక్కరూ తమ తల్లి పేరున మొక్కలు నాటాలని జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ ఎం. పూర్ణిమ సూచించారు. వనమహోత్సవంలో భాగంగా మండలంలోని పాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో మొక్కలు నాటుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కుబడిగా కౌన్సిల్ సమావేశం


పలు అంశాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

ఏలేశ్వరం: ప్రజా సమస్యలపై చర్చించాల్సిన కౌన్సిల్ సమావేశం తూతూమంత్రంగా జరిగింది. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. తొలుత అజెండాలోని అంశాలను చదివి వినిపించారు. అనంతరం సభ్యులు పలు అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో ఆహారం తిని 88 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటనను కౌన్సిల్‌లో చర్చించలేకపోవడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై కౌన్సిల్‌లో సభ్యులెవ్వరూ ప్రస్తావించకపోవడం గమనార్హం. కేవలం అజెండాలోని అంశాలనే చర్చించి చేతులు దులుపుకొన్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం పట్టణంలో విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులపైనా సభ్యులు చర్చించలేదు. పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో పాటు పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కౌన్సిల్ సభ్యులు దీనిపై కూడా చర్చించలేదు. మొక్కుబడిగా కౌన్సిల్ సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో కమిషనర్ కె శివప్రసాద్, వైస్ చైర్‌పర్సన్లు శిడగం త్రివేణి, మసిరపు బుజ్జి, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో తనిఖీలు


ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ భావన

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ట్రైనీ కలెక్టర్ భావన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, వంటగది నిర్వహణను ఆమె పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా ? లేదా ? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల, డార్మెట్రీ, మరుగుదొడ్లను ఆమె పరిశీలించారు. ఎప్పటికప్పుడు మరుగుదొడ్లను శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించరాదన్నారు. పాఠశాల ఆవరణలో అపరిశుభ్రత నెలకొనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో రికార్డులు, విద్యార్థులు హాజరు శాతం పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరుపై ప్రిన్సిపాల్ విజయ్‌బాబును ఆరా తీశారు. పాఠశాల నిర్వహణపై నివేదిక తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పలవురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీడని వాన

- రెండోరోజూ ఎడతెరిపి లేకుండా వర్షం
- పల్లపు ప్రాంతాలు జలమయం

ఏలేశ్వరం: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రెండోరోజు శనివారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. పల్లపుప్రాంతాలు జలమయం కాగా రహదారులు, పంట పొలాలు నీటమునిగాయి. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షానికి జనం ఇళ్లకే పరిమితమయ్యారు. రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో ప్రభుత్వ పాఠశాలలు మూతపడగా ప్రైవేట్ పాఠశాలలు పనిచేశాయి. వర్షంతో పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని యర్రవరం, తిరుమాలి, సిరిపురం తదితర గ్రామాల్లో పంట పొలాలు నీటమునిగాయి.


అచ్చంపేట వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరద

స్తంభించిన జనజీవనం

ప్రత్తిపాడు రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శనివారం మండల వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షానికి జనజీవనం స్తంభించిపోయింది. మధ్యాహ్నం కొంత మేర తగ్గినా తిరిగి యథావిధిగా వర్షం కొనసాగింది. రాత్రికి వర్షం మరింత ఊపందుకుంది. వర్షం ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు, పలు వీధులు, రహదారులు జలమయమయ్యాయి. ప్రజలు అత్యవసర పనులు ఉంటే మినహా బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. వీధి వ్యాపారులు, భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక ఇంటికే పరిమితం అయ్యారు. వర్షానికి డ్రైన్లలో నీటి ప్రవాహం నిలిచిపోయి రోడ్లపై మురుగునీరు ప్రవహించింది.


ప్రత్తిపాడు తోటవీధిలో రహదారిపై నిలిచిపోయిన వర్షపు నీరు


విస్తారంగా వర్షాలు

శంఖవరం: మండల వ్యాప్తంగా రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ రోజంతా వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. పత్తి, కూరగాయల పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శంఖవరం, కత్తిపూడి, కొంతంగి గ్రామాల్లో చెరువులు నిండికుండల్లా మారాయి. సిద్ధవారి చెరువు నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లడంతో పొలాలు నీట మునిగాయి. ఈదురుగాలుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణం చేసే వారు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. వర్షాలకు తడవడం వలన జ్వరం, జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం వైద్యులు హెచ్చరిస్తున్నారు.

విద్యుత్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జగ్గంపేట: తుపాన్ కారణంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జగ్గంపేట విద్యుత్ డివిజన్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు శనివారం తెలిపారు. స్తంభాలు కూలినా, విద్యుత్ వైర్లు దెబ్బతిన్నా, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినా తక్షణమే కంట్రోల్ రూమ్ నంబర్ 94906 10097కు ఫోన్ చేయాలని కోరారు. కంట్రోల్ రూమ్ 24 గంటలూ పనిచేస్తుందని తెలిపారు.


ఏలేశ్వరంలో రహదారిపై నిలిచిన నీరు


యర్రవరంలో నీటమునిగిన పంట పొలం

దోషులను కఠినంగా శిక్షించాలి



జగ్గంపేట డిగ్రీ కాలేజీ వద్ద ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

జగ్గంపేట: కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులోని ఎస్ఆర్‌జీ ఇంజినీరింగ్ కళాశాలలో హిడెన్ కెమెరాలు ఏర్పాటు చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) నేతలు డిమాండ్ చేశారు. జగ్గంపేట డిగ్రీ కాలేజీ వద్ద శనివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు ఘటనకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కె.సతీష్ మాట్లాడుతూ విద్యార్థినుల బాత్‌రూమ్‌లో హిడెన్ కెమెరాలు పెట్టినట్టు తెలిసిన వెంటనే యాజమాన్యం స్పందించక పోవడం దారుణమన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘటనపై రాజకీయాలకు అతీతంగా దర్యాప్తు చేయాలని కోరారు.

రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన

గుడ్లవల్లేరులోని ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థినుల బాత్‌రూమ్‌లో కెమెరాలు ఏర్పాటు చేసి వారి జీవితాలతో ఆడుకోవడం దారుణమని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజినేయులు అన్నారు. ఈ ఘటనకు నిరసనగా జగ్గంపేట శివారు రంగవల్లి నగర్‌లో శనివారం ఆందోళన చేపట్టారు. రాష్ట్రంలోని బాలికల హాస్టళ్లు, కాలేజీల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో పీడీఎస్‌యూ నేతలు, రైతు కూలీ సంఘం నేతలు, డిగ్రీ కాలేజీ విద్యార్థినులు పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు


ఈఓపీఆర్డీ మూర్తి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

గండేపల్లి: విధి నిర్వహణలో చేసిన సేవలే ఉద్యోగులకు గుర్తింపును ఇస్తాయని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఈఓపీఆర్డీ వీఎస్ఎన్ మూర్తి ఉద్యోగ విరమణ సందర్భంగా జెడ్.రాగంపేట పరిణయ ఫంక్షన్ హాలులో శనివారం ఎంపీపీ చలగళ్ల దొరబాబు ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఈఓపీఆర్డీని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఓపీఆర్డీగా సుమారు ఏడు సంవత్సరాల పాటు పనిచేసిన మూర్తి విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించారన్నారు. అనంతరం మూర్తి దంపతులను పూలమాలలు, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, సర్పంచులు కందుల చిట్టిబాబు, అడబాల ఆంజనేయులు, రుత్తల లలిత, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతిసౌజన్య, ఎంపీడీఓ రామన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కుళాయిల నుంచి బురద నీరు

సామర్లకోట: మున్సిపాలిటీ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందజేయాల్సి ఉండగా గత మూడు రోజులుగా మున్సిపల్ కుళాయిల నుంచి బురద నీరు సరఫరా అవుతుంది. వారం రోజులుగా వర్షాలు కురియడంతో ప్రజలు అనారోగ్యానికి గురి అవుతున్నారు. ఇటు వంటి సమయంలో కుళాయిల నుంచి బురదనీరు ఇవ్వడంపై మానవహక్కుల సంఘ జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ, సీనియర్ కౌన్సిలర్ నేతల హరిబాబులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని వారు ఆరోపించారు. దీనిపై కమిషనర్ ఎ.శ్రీవిద్య మాట్లాడుతూ శనివారం ఫిల్టర్ బెడ్ ప్లాంటును పరిశీలించామని, అక్కడ నీరు స్వచ్ఛంగా ఉందని, పైపులైన్లు లీకవడంతో బురద నీరు వస్తుందని తెలిపారు. ప్రజలందరూ కాచి, చల్లార్చి నీటినే తాగాలని విజ్ఞప్తి చేశారు.